క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 4న విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. గోకుల్‌నగర్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, అడ్వకేట్స్ కాలనీ, హంటర్ రోడ్డు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, నక్కలగుట్ట మెయిన్‌రోడ్డు, బాలసముద్రం ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు, మడికొండ ఇండస్ట్రియల్ ఏరియాలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

'డీజే'లు పెడితే కఠిన చర్యలు

రామన్నపేట: వివాహ, ఇతర వేడుకల్లో డీజే సౌండ్స్ పెట్టే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ హెచ్చరించారు. ఇంటర్మీడియేట్, ఎస్సెస్సీ, ఇతర పరీక్షలు ఉన్నందున వివాహ ఊరేగింపుల్లో, ఇతర వేడుకల్లో డీజే సౌండ్స్ పెట్టి విద్యార్థులు, వృద్ధులు, చిన్న పిల్లలకు ఇబ్బంది కలిగించే డీజే సౌండ్స్ ఆపరేటర్లు, యజమానులు, వేడుకల నిర్వాహకులపై కేసులు నమోదు చేసి డీజేలను సీజ్ చేస్తామని పేర్కొన్నారు.

మడికొండ పీఎస్ సందర్శన



మడికొండ: మడికొండ పోలీసు స్టేషన్‌ను కాజీపేట ఏసీపీ తిరుమల్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులను పరిష్కరించాలని ఇన్‌స్పెక్టర్ కిషన్‌కు సూచించారు. స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్‌కు పలు సూచనలు చేశారు.

కేయూలో నేడు 'అకుట్' ఎన్నిక

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో అధ్యాపకుల సంఘం (అకుట్) ఎన్నికలు ఈనెల 4న జరగనున్నాయి. అధ్యక్ష పదవికి ఫిజిక్స్ విభాగం ప్రొఫెసర్ వెంకట్రాంరెడ్డి, జియాలజీ విభాగం ప్రొఫెసర్ మల్లికార్జున్ రెడ్డి, జనరల్ సెక్రటరీగా బయో టెక్నాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.శ్రీనివాస్, మ్యాథ్‌మెటిక్స్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్‌పీ.రాజ్‌కుమార్ పోటీ పడుతున్నారు. మంగళవారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు పరిపాలన భవనంలోని సెనెట్‌హాల్, కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాలలో పోలింగ్ నిర్వహించనున్నారు. 5న యూనివర్సిటీలో ఓట్ల లెక్కింపు, అనంతరం ఫలితాలను వెల్లడించనున్నారు. కేయూ పరిధిలో 76మంది అధ్యాపకులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

వన్యప్రాణులను రక్షించాలి

విద్యారణ్యపురి: వన్యప్రాణులను రక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని రిటైర్డ్ డీఎఫ్ఓ పురుషోత్తం అన్నారు. వన్యప్రాణుల దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జువాలజీ విభాగం ఆధ్వర్యంలో సోమవారం సింపోజియం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ తప్పిదాలతో వన్యప్రాణులు తమ ఆవాసాన్ని కోల్పోయి, క్రమంగా అవి అంతరించిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సమావేశంలో డాక్టర్ ప్రవీణ్ కుమార్, కన్వీనర్ డాక్టర్ దినేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ గోరె, సభ్యులు డాక్టర్ రాజయ్య, డాక్టర్ రోహిణి, డాక్టర్ స్వామి, వివిధ విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు, పోస్టర్ల ప్రదర్శనను నిర్వహించారు. అనంతరం విజేతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం



కాజీపేట: కాజీపేట – సోమిడి ప్రధాన రహదారి విస్తరణ పనులను కార్పొరేటర్లు విజయశ్రీరజాలీ, జక్కుల రవీందర్ యాదవ్ సోమవారం ప్రారంభించారు. 62, 63వ డివిజన్ల పరిధిలో ప్రధాన రహదారి విస్తరణకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి నిధులు మంజూరు చేయగా, మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలో సీసీ రోడ్డు నిర్మిస్తున్నారు. కార్యక్రమంలో ఎండీ.బిలాల్, నదునూరి కుమారస్వామి, బొందెలు సురేష్, ఎండీ.ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

మంకీ ఫుడ్ కోర్టుల అభివృద్ధికి కృషి

ఖిలా వరంగల్: కరీమాబాద్‌లోని ముంకుందా లేఔట్ ప్రాంగణంలో చిల్డ్రన్ పార్కు, మంకీ ఫుడ్‌కోర్టుల ఏర్పాటుకు కృషి చేస్తానని స్థానిక కార్పొరేటర్ మరుపల్లి రవి అన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని వరంగల్ 40వ డివిజన్ ప్రజలు కార్పొరేటర్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో భూక్య వినయ్, ఉల్లి కవిత, నాగరాజు, డాక్టర్ కృష్ణవేణి, రజిత పాల్గొన్నారు.









నిబంధనలు పాటించని ఆటోవాలాలు

- పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు
- పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు

నగరంలోని కొందరు ఆటోవాలాలు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం లేదు. ఫలితంగా రోడ్డు ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. ఆటో డ్రైవర్‌కు వెనుక నుంచి వచ్చే వాహనాలు తన ముందున్న అద్దంలో కనిపించడానికి ఆటో వెనుక భాగంలో ఓపెన్ ఉండాలి. తద్వారా వెనుక నుంచి వచ్చే వాహనాలను గమనిస్తూ డ్రైవింగ్ చేయాలి. కొందరు డ్రైవర్లు డబ్బులకు ఆశపడి నిబంధనలకు తిలోదకాలు ఇస్తున్నారు. ఆటోకు వెనుక ఓపెన్ భాగాన్ని వివిధ కంపెనీలు, సినిమా, పార్టీల ప్రచార పోస్టర్లతో మూసివేస్తున్నారు. దీంతో వెనుక నుంచి వచ్చే వాహనాలు డ్రైవర్‌కు కనిపించక ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ట్రాఫిక్ పోలీసులు తనిఖీల సమయంలో చలానాలు రాస్తున్నారే తప్ప ప్రయాణికుల భద్రతపై దృష్టి సారించడం లేదు. **- కాజీపేట**

దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలి

- వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద
- ప్రజావాణికి 88 వినతులు

వరంగల్: ప్రజావాణికి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అధికారులను వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులను కలెక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలని, ఒకవేళ పరిష్కరించకుంటే ఎందుకు పరిష్కరించలేదో దరఖాస్తుదారుడికి సమాధానం ఇవ్వాలని అన్నారు. గ్రీవెన్స్‌కు మొత్తం 88 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో డీఆర్‌ఓ విజయలక్ష్మి, ఆర్డీఓలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి, డీఆర్‌డీఓ కౌసల్యదేవి, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి అనురాధ, డీసీఓ నీరజ, డీపీఓ కల్పన, డీఎంఓ సురేఖ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సత్యశారద, అధికారులు

మూడేళ్లుగా తిరుగుతున్నా..



వితంతు పింఛన్ కోసం మూడేళ్లుగా తిరుగుతున్నా. నా భర్త ప్రభుత్వ ఉద్యోగి అని అధికారులు అంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగి కాదని మరణ ధ్రువీకరణ పత్రం ఇచ్చినా.. పట్టించుకోవడం లేదు. నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలి. **- పనికర అనిత, వరంగల్**

'సంస్కార వికాసం'తో విద్యార్థులకు మేలు

హన్మకొండ అర్బన్: గతేడాది నవంబర్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు జిల్లాలోని 45 పాఠశాలల్లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన సంస్కార వికాస శిక్షణ కార్యక్రమం.. విద్యార్థులకు విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసానికి ఎంతో దోహదపడుతుందని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. డీఈఓ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, ఓరుగల్లు కన్జ్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ గోపాలపూర్ ప్రతినిధులు.. కలెక్టర్‌ను కలెక్టరేట్‌లో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ విద్యార్థుల్లో విలువలతో కూడిన విద్య, జీవన నైపుణ్యాలు, కౌమార విద్యపై అవగాహన పెంచడమే లక్ష్యంగా నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా జిల్లాల్లోని 15 వేలకు పైగా విద్యార్థులకు సీనియర్ సిటిజన్లు తమ అమూల్యమైన సందేశాన్ని అందించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్తలు తేరాల యుగంధర్, కజాంపురం మార్క రవీందర్‌గౌడ్, తాడూరి లక్ష్మీనారాయణను కలెక్టర్ అభినందించారు.



కలెక్టర్‌తో డీఈఓ వాసంతి, సామాజిక కార్యకర్తలు

టెన్త్ ప్రీఫైనల్ పరీక్షలు ఉదయమే నిర్వహించాలి

విద్యారణ్యపురి: టెన్త్ విద్యార్థులు ఈనెల 6వ తేదీ నుంచి నిర్వహించనున్న ప్రీ ఫైనల్ పరీక్షలను మధ్యాహ్నం కాకుండా ఉదయమే నిర్వహించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండ డీఈఓ వాసంతికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఎండల తీవ్రత దృష్ట్యా విద్యార్థులు ఇబ్బందులు పడుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సుజిత్, జోనల్ ఇన్‌చార్జ్ హరిచరణ్, బాధ్యులు శ్రీకాంత్, రోహిత్, నవీన్, సంహిత్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

హాల్‌టికెట్లు ఇవ్వని కళాశాలలపై చర్య తీసుకోవాలి



కేయూ క్యాంపస్: ఇంటర్మీడియట్ విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇవ్వని ప్రైవేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీఎస్‌ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధిక ఫీజుల వసూళ్లకు పాల్పడుతున్న ప్రైవేట్ కళాశాలలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏబీఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు దార సురేష్, కేయూ జనరల్ సెక్రటరీ బండారి పృథ్వీరాజ్, బాధ్యులు అర్షం చరణ్, తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ఐ చర్చి సమస్యలు పరిష్కరించాలని వినతి



కాజీపేట: కాజీపేట సీఎస్ఐ చర్చి సమస్యలు పరిష్కరించాలని చర్చి ప్రతినిధులు కోరారు. ఈమేరకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. చర్చి పాస్టర్ విక్టర్‌పాల్ ఆధ్వర్యంలో చర్చి సమస్యలను సభ్యులు విన్నవించారు. సిరిల్ లారెన్స్, ధర్మరాజు, మేసురాజు, దొంగల కుమార్, బర్ల రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సిబ్బందికి ఆటల పోటీలు



మహిళలతో రైల్వే ఉమెన్స్ కమిటీ సభ్యులు



క్యారమ్స్ ఆడుతున్న మహిళా న్యాయమూర్తులు

కాజీపేట రూరల్: ఉమెన్స్‌డేను పురస్కరించుకొని కాజీపేట రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూడబ్ల్యూఓ) కమిటీ ఆధ్వర్యంలో కాజీపేట డీజిల్ కాలనీ రైల్వే ఇన్‌స్టిట్యూట్ ప్రాంగణంలో రైల్వే మహిళా సిబ్బందికి వివిధ రకాల ఆటల పోటీలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాజీపేట రైల్వే డబ్ల్యూడబ్ల్యూఓ సెక్రటరీ ఎస్.వసంతకుమారి, ట్రెజరర్ వై.మంజుల మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో సీటీఐ మహేందర్‌రెడ్డి, ఎస్ఎస్ఈ ఎ.సంతోష్‌కుమార్, డీజిల్‌కాలనీ రైల్వే ఇన్‌స్టిట్యూట్ సెక్రటరీ సాల్మన్‌రాజ్, శంకర్, అంతయ్య, కేబీ.రెడ్డి, ఆంథోని, నర్సయ్య, రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

మహిళా న్యాయమూర్తులకు ఆటల పోటీలు

వరంగల్ లీగల్: ఈనెల 8న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్ జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ప్రాంగణంలో మహిళా న్యాయమూర్తులకు నిర్వహిస్తున్న ఆటల పోటీల్లో భాగంగా సోమవారం షటిల్, క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వరంగల్, హనుమకొండ జిల్లాల మహిళా న్యాయమూర్తులు క్షమాదేశ్ పాండే, ఉషా క్రాంతి, రితికా, చందన, ప్రియాంక, మహ్మద్ ఫారిహ అహ్మద్, శ్రావణ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

సంరక్ష ఆస్పత్రికి రెండు పీజీ సీట్లు



హిమాలయ గుప్తాకు అప్రాన్, స్టెతస్కోప్ అందిస్తున్న కేఎంసీ ప్రిన్సిపాల్ రాంకుమార్‌రెడ్డి

వరంగల్: వరంగల్ నగరంలోని సంరక్ష సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో కేంద్ర ప్రభుత్వ మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ, డీజీహెచ్‌ఎస్ మినిస్ట్రీ ఆఫ్ హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో ఆర్థోపెడిక్ విభాగంలో రెండు పీజీ కోర్సుల సీట్లు మంజూరయ్యాయని ఆస్పత్రి చైర్మన్ దొడ్డ రమేష్ తెలిపారు. కేంద్రం మంజూరు చేసిన రెండు పీజీ సీట్లలో ఒక సీటులో ఢిల్లీకి చెందిన పీజీ విద్యార్థి డాక్టర్ హిమాలయ గుప్తా ప్రవేశం పొందారు. ఈమేరకు హిమాలయ గుప్తాకు అప్రాన్, స్టెత్‌స్కోప్‌ను కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాంకుమార్‌రెడ్డి సోమవారం అందించారు. కార్యక్రమంలో సంరక్ష ఆస్పత్రి వైస్ చైర్మన్ డాక్టర్ కె.తిరుపతిరెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ దిడ్డి శ్రవణ్, డాక్టర్ అజిత్ మహమ్మద్, డాక్టర్ మోహన్‌రావు, డాక్టర్ సంధ్య, డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ పోలా నటరాజ్ పాల్గొన్నారు.

స్పెషల్ పోలీసులకు బ్యాడ్మింటన్ పోటీలు



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న అడిషనల్ కమాండెంట్ సురేష్

మామునూరు: ఖిలా వరంగల్ మండలం మామునూరు టీజీఎస్పీ నాలుగో బెటాలియన్‌లో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర హనుమకొండ బ్రాంచ్ ఆధ్వర్యంలో స్పెషల్ పోలీసులకు బ్యాడ్మింటన్ క్రీడాపోటీలను సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అడిషనల్ కమాండెంట్ ఎంఐ సురేష్ హాజరై క్రీడాపోటీలను ప్రారంభించి మాట్లాడారు. ఆటలతో ప్రశాంతత, మానసిక ఉల్లాసం కలుగుతుందని అన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ వీరన్న, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు రవి, వెంకటేశ్వర్లు, రాజ్‌కుమార్, అశోక్, కృష్ణ, బ్యాంక్ మేనేజర్ రమేష్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

లారీ ఢీకొట్టడంతో విరిగిన స్తంభం



ఖిలా వరంగల్: వరంగల్ 34వ డివిజన్ శివనగర్‌లోని చైత్రరథ గార్డెన్ లైన్‌లో విద్యుత్ స్తంభాన్ని ట్రాన్స్‌పోర్ట్ లారీ సోమవారం ఢీకొట్టింది. దాంతో ఆ స్తంభం విరిగి ఒక పక్కకు ఒరిగింది. విరిగిన విద్యుత్ స్తంభాన్ని విద్యుత్ సిబ్బంది తొలగించి దానిస్థానంలో నూతన స్తంభాన్ని ఏర్పాటు చేసి విద్యుత్‌ను సరఫరాను పునరుద్ధరించారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

వరంగల్: ఏనుమాముల పోలీస్ స్టేషన్ పరిధిలో ఇందిరమ్మ కాలనీ ఫేస్ –2కు చెందిన చెట్టుపల్లి రమాదేవి ఆదివారం సాయంత్రం తన ఇంటికి తాళం వేసి తన మనవరాలు పుట్టు వెంట్రుకల కోసం వేములవాడకు వెళ్లింది. అదేరోజు రాత్రి గుర్తుతెలియని దొంగలు ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న రూ.18 వేలను అపహరించుకెళ్లారు. బాధితురాలు రమాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ తెలిపారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి వృద్ధుడి మృతి

ఖిలా వరంగల్: బహిర్భూమికి వెళ్లిన ఓ వృద్ధుడు ప్రమాదవశాత్తు కాలుజారి అగర్త చెరువులో పడగా, ఈత రాకపోవడంతో నీటిలో మునిగి మృతి చెందిన ఘటన సోమవారం జరిగింది. ఎస్సై శ్రీకాంత్ కథనం ప్రకారం శివనగర్‌లోని ఏసిరెడ్డినగర్‌కు చెందిన కీర్తి సూరయ్య (65) సోమవారం ఉదయం ఖిలా వరంగల్ అగర్త చెరువు వద్ద కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి చెరువులో పడి మృతిచెందాడు. మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందించారు. మృతుడి కుమారుడు రమేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ వివరించారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడి మృతి

ఖిలా వరంగల్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలై ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడు సోమవారం తుదిశ్వాస విడిచాడు. మిల్స్ కాలనీ పోలీసుల కథనం ప్రకారం వరంగల్ నర్సంపేట రహదారి అబ్బనికుంటకు చెందిన కొంతం భద్రయ్య (82) గోదావరిఖనిలో బంధువుల పెళ్లికి వెళ్లి తిరిగి ఆదివారం సాయంత్రం ఇంటికి బయల్దేరాడు. లేబర్‌కాలనీ సీబీఎస్ చర్చి సమీపంలో నర్సంపేట రోడ్డు దాటుతుండగా ధర్మారం గ్రామానికి చెందిన ఓ యువకుడు బైక్‌పై అతివేగంగా స్నేక్ డ్రైవ్ చేస్తూ వచ్చి భద్రయ్యను బలంగా ఢీకొట్టాడు. దాంతో అతని తలకు బలమైన గాయాలు కాగా, ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి భార్య కొంతం ఉపేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం తెలిపారు.

బీజేపీ విధానాలను నిరసిస్తూ పోరాడాలి

న్యూశాయంపేట: బీజేపీ ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలను నిరసిస్తూ పోరాడాలని ఏఐకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ పిలుపునిచ్చారు. హనుమకొండ రాంనగర్‌లో సీఐటీయూ, ఏఐఏడబ్ల్యూ, ఏఐకేఎస్ హనుమకొండ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్.. ప్రజలపై భారాలు అనే అంశంపై జిల్లా సెమినార్‌ను వాసుదేవరెడ్డి, ఉప్పలయ్య, నాగరాజు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ముఖ్యవక్తగా సాగర్ మాట్లాడుతూ కేంద్రం బడ్జెట్ లోటును పూడ్చేందుకు ప్రభుత్వరంగ సంస్థల్లోని రూ.47 వేల కోట్లు విలువచేసే వాటాలను విక్రయించాలని ప్రతిపాదించారని ఆరోపించారు. ప్రభుత్వరంగ సంస్థలైన నవరత్నాలు, 78 మినీ రత్నాలను ప్రైవేకరించడం, విక్రయించడం, కార్మిక సంస్కరణలను వేగవంతం చేసే చర్యలు తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను సవరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లాలో ఈనెల 4నుంచి 15 వరకు మండలాల్లో సదస్సులు నిర్వహించాలని తీర్మానం చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో నాయకులు రాములు, చుక్కయ్య, చక్రపాణి, అశోక్, రజిత, మహేష్ సంపత్, యాకయ్య, రాఘవులు, పద్మ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సాగర్

ఓంకార్, బీఎన్‌రెడ్డి పేర్లు వాడితే చర్యలు



ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

ఖిలా వరంగల్: దివంగత మాజీ ఎమ్మెల్యే మద్దికాయల ఓంకార్, బీఎన్‌రెడ్డి పేర్లను పార్టీ బహిష్కృత నేతలు వాడితే చర్యలు తప్పవని ఎంసీపీఐ (యూ) పొలిట్ బ్యూరో సభ్యుడు వల్లెపు ఉపేందర్ రెడ్డి హెచ్చరించారు. ఈమేరకు వరంగల్ మిల్స్ కాలనీ పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నంను సోమవారం కలిసి బహిష్కృత నేతలపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ 1984లో దివంగత మద్దికాయల ఓంకార్ ఎంసీపీ స్థాపించగా, ఎంసీపీఐ (యూ)గా మార్పు చెందిందని అన్నారు. ఈక్రమంలో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు, ఆర్థిక అరాచకత్వానికి పాల్పడినందున మోర్తాల చందర్‌రావు, సింగతి సాంబయ్య, లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మద్రెడ్డి వెంకటరెడ్డి, పానుగంటి నర్సయ్యతోపాటు మరికొంతమందిని పార్టీ నుంచి బహిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర కమిటీ సభ్యులు గోనె కుమారస్వామి, హనుమకొండ జిల్లా కార్యదర్శులు పెద్దారపు రమేష్, ఎస్‌రెడ్డి హంసారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు నర్ర ప్రతాప్, గడ్డం నాగార్జున, మాస్ సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

- డీపీఓ రమాకాంత్

హసన్‌పర్తి: వేసవి దృష్ట్యా గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను హనుమకొండ జిల్లా పంచాయతీ అధికారి రమాకాంత్ ఆదేశించారు. హసన్‌పర్తి మండలం జయగిరి గ్రామంలో డీపీఓ సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిషన్ భగీరథ నీరు సరఫరా కాకుంటే ట్యాంకర్ల ద్వారా నీరు అందించాలని సూచించారు. తొలుత గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలను పరిశీలించారు. మొక్కలు ఎండిపోకుండా చూడాలన్నారు. ప్రజలకు అవసరమైన మొక్కలను పెంచాలని సూచించారు. పొడి, తడి చెత్తను వేర్వేరుగా సేకరించాలన్నారు. అలాగే, సెగ్రిగేషన్ షెడ్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి కర్ణాకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



నర్సరీని పరిశీలిస్తున్న డీపీఓ రమాకాంత్

'పార్ట్‌టైం లెక్చరర్ల' నోటిఫికేషన్ ఇవ్వాలి



ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల బాధ్యులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో వివిధ విభాగాల్లో పార్ట్‌టైం లెక్చరర్ల నియామకాలకు నోటిఫికేషన్ ఇవ్వాలని వివిధ విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు క్యాంపస్‌లోని పరిపాలన భవనంలోని వీసీ చాంబర్‌లో బైఠాయించి సోమవారం ఆందోళన చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని ఆందోళనను విరమింపజేశారు. ఎంఎస్‌ఎఫ్ కేయూ ఇన్‌చార్జ్ డాక్టర్ వద్దేపెల్లి మధు, బీఆర్‌ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ అరూరి రంజిత్, కన్వీనర్ డాక్టర్ మద్దిరాల మోహన్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు మహ్మద్ పాషా, డాక్టర్ సంపత్‌కుమార్, పంతంగి చందర్‌రావు, కుమారస్వామి, పాశం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

దూరవిద్యలో మూడు పుస్తకాలు విడుదల

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని దూరవిద్య కేంద్రంలో పీజీ కోర్సుల ఆర్ట్స్ మొదటి సెమిస్టర్‌కు సంబంధించిన మూడు పుస్తకాలను దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ సురేష్‌లాల్, ఆర్ట్స్ కోర్సుల కోఆర్డినేటర్ డాక్టర్ కొట్టె భాస్కర్ సోమవారం విడుదల చేశారు. దూరవిద్య పీజీలో సెమిస్టర్ సిస్టమ్ విధానం కొనసాగుతోంది. సెమిస్టర్ విధానం వచ్చాక నూతనంగా సెమిస్టర్ విద్యార్థులకు ఆర్ట్స్‌లో తెలుగు సాహిత్య చరిత్ర, వ్యాకరణం, ఆంధ్రుల చరిత్ర – సంస్కృతి పుస్తకాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎస్‌డీఎల్‌సీఈ బుక్స్ స్టోర్ ఇన్‌చార్జ్ తాలియాల కుమార్, తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలను విడుదల చేస్తున్న సురేష్‌లాల్, తదితరులు